క్లుప్తంగా

దళితుల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ చినబాబు

పెదపూడి: దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన దివంగత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ గొప్ప నాయకుడని రామేశ్వరం సర్పంచ్ కొటికలపూడి చినబాబు అన్నారు. గ్రామంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి గురువారం నిర్వహించారు. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి చినబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొటికలపూడి వరలక్ష్మి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బసవ విజయకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల ఈశ్వర వెంకట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మధురపూడి: కోరుకొండ మండలం బుచ్చెంపేట, మధురపూడి, గాడాల గ్రామాల్లో గురువారం మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి నిర్వహించారు. మాదిగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేదిక కన్వీనర్ మద్దాల చంటిబాబు మాట్లాడుతూ హక్కుల సాధన కోసం మాదిగలందరూ ఐక్యంగా ఉండాలన్నారు. గౌరవాధ్యక్షులు ఇందుగమెల్లి సత్యనారాయణ, జొన్నకూటి నాని, శివ పాల్గొన్నారు.

పశువులకు బ్రూసెల్లోసిస్ నివారణ టీకాలు



కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న ఏడీఏ డాక్టర్ శ్రీనివాసరావు

రంగంపేట: మండలంలోని పశు వైద్యశాలలు, అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో పశువులకు బ్రూసెల్లోసిస్ నివారణ టీకాలు వేయనున్నట్టు మండల పశు వైద్యాధికారి జాన్‌పాల్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వెటర్నరీ అసిస్టెంట్లు శుక్రవారం నుంచి ఆయా గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. నాలుగు నెలల నుంచి 8 నెలల వయస్సున్న ఆడ దూడలకు మాత్రమే ఈ టీకాలు వేయించాలని సూచించారు. ఈ నెలాఖరు వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

పెంపుడు జంతువులతోనూ వ్యాధుల ముప్పు

అనపర్తి: పెంపుడు జంతువులతోనూ మనుషులకు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు (ఏడీఏ) డాక్టర్ యర్రం శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా స్థానిక పాత ఊరిలోని పశు వైద్య శాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకా వేసే కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అనేక సందర్భాల్లో జంతువులు, పక్షుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారని, వీటిపై ప్రజలకు అవగాహన కల్పించి, నివారణ చర్యలు తెలిపేందుకు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం నిర్వహిస్తున్నామని వివరించారు. పెంపుడు కుక్కలు, ఇతర జంతువులను పెంచుకునే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాటి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, వాటికి వ్యాధి నిరోధక టీకాలను సరైన సమయానికి వేయించాలని సూచించారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి సహకారం

గోకవరం: రైతుల ఆర్థికాభివృద్ధికి యూనియన్ బ్యాంకు అన్ని విధాల సహకారం అందిస్తుందని ఆ బ్యాంకు రీజినల్ చీఫ్ మేనేజర్ జీవీ నరసింహమూర్తి అన్నారు. గుమ్మళ్లదొడ్డి గ్రామంలో స్థానిక రైతులు, బ్యాంకు ఖాతాదారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు, ఖాతాదారులకు అందుబాటులో ఉన్న రుణాల గురించి వివరించారు. రైతుల వ్యవసాయ అవసరాల కోసం మరింతగా రుణ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఖాతాదారులు, రైతులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్వర్టర్ వితరణ

సీతానగరం: వెదుళ్లపల్లిలోని పశువుల ఆసుపత్రికి కూనవరం సర్పంచ్ ఎస్.గంగాలక్ష్మి గురువారం ఇన్వర్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు ఆసుపత్రి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

భోజనం పంపిణీ

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో నిరుపేదలకు గురువారం భోజనం ప్యాకెట్లు అందించారు. దాతలు డాక్టర్ ఘంటా గణేశ్వరరావు, రత్నం దంపతుల సహకారంతో 150 మందికి వితరణ చేశారు.

దుంప సాగుకు ధరాఘాతం



మర్రిపూడిలో నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన దుంప నారు



పొలానికి నారును తరలిస్తున్న రైతులు

- గణనీయంగా తగ్గిన విస్తీర్ణం
- ప్రత్యామ్నాయ పంటలపై రైతుల ఆసక్తి

రంగంపేట: కర్రపెండలం దుంప సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతోంది. సరైన ధర రాని కారణంగా రైతులు ఈ సాగును మానేసి, ప్రత్యామ్నాయ పంటల వైపు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని మర్రిపూడి, దొడ్డిగుంట, సింగంపల్లి, వెంకటాపురం, కోటపాడు, వీరంపాలెం గ్రామాల్లో కర్రపెండలం దుంప పంట సాగవుతోంది. గతంలో ఐదు వేల ఎకరాల్లో సాగయ్యే పంట విస్తీర్ణం ప్రస్తుతం సగానికి అంటే రెండున్నర వేల ఎకరాలకు తగ్గిపోయింది. ఈ ఏడాది రెండు వేల ఎకరాలకు మించదని ఉద్యానవన శాఖ ప్రాథమికంగా అంచనా వేస్తోంది.

పామాయిల్ వైపు చూపు

ఇటీవల రైతులు పెద్ద ఎత్తున పామాయిల్ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. దాని ప్రభావం కర్రపెండలం దుంప పంటపై పడింది. ఇప్పుడు కేవలం రెండు మూడు ఎకరాలకు మించని సన్నకారు, చిన్నకారు రైతులే దుంప పంటను కొనసాగిస్తున్నారు. పదేళ్లుగా దుంప ధర పెరగకపోవడంతో ఈ పంటపై ఆసక్తి చూపడం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రంగంపేట మండలంలో దుంప పంట కనిపించని రోజులు రావచ్చని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.

ధర పెరిగితే..

దుంపను కొనుగోలు చేసే సగ్గుబియ్యం మిల్లర్లు ప్రస్తుతం ఉన్న సగ్గుబియ్యం ధర ఆధారంగా పుట్టి (225 కిలోలు) దుంపకు రూ.2 వేలు చెల్లిస్తే దుంప పంట విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా దుంప రైతుల సంఘం గౌరవ అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి అన్నారు. దీనికి తోడు ఎకరానికి 30 పుట్లనిచ్చే దుంప విత్తనం బదులుగా 50 నుంచి 60 పుట్ల దిగుబడినిచ్చే తమిళనాడు దుంప విత్తనాన్ని ఉద్యానవన శాఖ దిగుమతి చేసుకుని రైతులకు ఉచితంగా అందించాలని ఆయన సూచించారు. గతంలో ఎకరానికి రూ.5 వేలు ఉండే దుంప భూమి శిస్తు ఇప్పుడు రూ.10 వేలకు పెరగడం కూడా విస్తీర్ణంపై ప్రభావం చూపించింది. ప్రస్తుతం ఎటువంటి నీటి పారుదల సౌకర్యం లేని రైతులు మాత్రమే దుంప పంటను కొసాగిస్తున్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం



బదిలీ అయిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నాయకులు

బిక్కవోలు: కొంకుదురు ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో పని చేసి, బదిలీ అయిన ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సత్కరించారు. ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్తి వీరమణి మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల క్రమశిక్షణ, ఉన్నత చదువులకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఎంతో మంది అధికారులు తయారు కావడం ఉపాధ్యాయుల వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బదిలీ అయిన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొవ్వూరి అమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు గొలుగూరి వెంకట రామారెడ్డి, చాగంటి సులోచన, మీసాల వీర వెంకట దుర్గా ప్రసాద్, ముత్య వెంకట భీమ నరసింహాలను సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లిపూడి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు కొంకుదురు పీవీ, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, మాజీ ఉప సర్పంచ్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

800 కేజీల బెల్లం స్వాధీనం

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండలో అనుమతులు లేకుండా బెల్లం విక్రయిస్తున్న కిరాణా దుకాణంపై సెబ్, పోలీసు అధికారులు గురువారం దాడి చేశారు. అక్రమంగా నిల్వచేసిన 800 కేజీల సారా తయారీకి ఉపయోగించే బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారి ముమ్మిడివరపు సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. కోరుకొండ ట్రైనీ ఏఎస్పీ పంకజ్ మీనన్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) కోరుకొండ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ దాడి జరిగింది. సెబ్ సీఐ మాట్లాడుతూ సారా తయారీ, విక్రయాల నిరోధంలో భాగంగా సెబ్ ఏఎస్పీ సోమశేఖర్ ఆదేశాల మేరకు ఈ దాడి చేశామన్నారు. గతంలో వ్యాపారస్తులకు సమావేశాలు నిర్వహించి బెల్లాన్ని గృహావసరాలకు తప్ప, సారా తయారీదారులకు విక్రయించవద్దని అవగాహన కల్పించామన్నారు. అయినా కొందరు లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారన్నారు. కోటికేశవరంలో సారా తయారీదారుకు బెల్లం అమ్మినట్టు తమకు తెలిసిందన్నారు. అతడు ఇచ్చిన సమాచారంతోనే ఈ దాడి చేశామన్నారు. గృహావసరాల కోసం కిరాణా వ్యాపారులు దుకాణంలో 100 కేజీల వరకూ బెల్లం ఉంచుకోవచ్చన్నారు. దాడిలో కోరుకొండ ఎస్సై కట్టా శారదా సతీష్, పోలీసులు, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి సంక్షేమ పథకాలు



లబ్ధిదారుకు ధ్రువపత్రం పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్ తదితరులు



సింగవరంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, నాయకులు

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

రంగంపేట: మండలంలోని మర్రిపూడి, వీరంపాలెం గ్రామాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ బి.శ్రీరామరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని తెలిపారు.

పెదపూడి: పేదలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో ఆదర్శవంతమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ అన్నారు. కరకుదురులో జగనన్న సురక్ష గ్రామసభ సర్పంచ్ వుండ్రు చంద్రకళ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, ఇంకా ఎవరైనా అర్హులకు ఏదైనా సంక్షేమ పథకం అందకపోతే తక్షణం వారికి అందించాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించిందని చెప్పారు. దీని ద్వారా కుల, ఆదాయ తదితర 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్నారని తెలిపారు. ఈ గ్రామసభలో 680 ధ్రువీకరణ పత్రాలు అందించారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి రామరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ వాసంశెట్టి మాధవ, ఈఓ పీఆర్డీ మన్యం శ్రీనివాస చౌదరి, సచివాలయ కార్యదర్శి బి.ప్రసన్నకుమార్, వీఆర్‌ఓ భాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

బిక్కవోలు: ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమమని సర్పంచ్ బండారు రమ్య అన్నారు. ఊలపల్లి సచివాలయం-1 వద్ద ఈ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, వైస్ ఎంపీపీ పెంకే మంగాయమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొమరిపాలెం సచివాలయం-2 వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో తహసీల్దార్ పోసిబాబు మాట్లాడుతూ, గ్రామంలోని రెండు సచివాలయాల్లో 2,700 ధ్రువపత్రాలు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్తి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: సింగవరంలో తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, ఇనుగంటివారిపేటలో ఎంపీడీవో కె.రమేష్ ఆధ్వర్యంలో గురువారం జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్‌బాబు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్‌ల సత్యం రాంపండు, ఎంపీటీసీ కుమ్మరశెట్టి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు మట్ట శ్రీనివాస్, చిర్ల పోశియ్య, అంబటి రమణ, కొంచ భాస్కరరావు, ఖాదర్‌వల్లీ, ప్రసాద్ పాల్గొన్నారు.

మధురపూడి: కోరుకొండ మండలం నర్సాపురం, కోటికేశవరం గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సర్రాజు, సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, కోటికేశవరం సర్పంచ్ ముడే సింధూదివ్య, పీఏసీఎస్ చైర్‌పర్సన్ మారిశెట్టి నాయుడు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



పందలపాకలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: పందలపాక గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. గడప గడపకూ ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా గ్రామంలో పలు సమస్యలు ఆయన దృష్టికి వచ్చాయి. వీటి పరిష్కారానికి ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అభివృద్ధికి అవకాశం ఎక్కువగా కలుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కిలపర్తి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి గండి వాసు, సొసైటీ డైరెక్టర్ పడాల వీరరాఘవరెడ్డి పాల్గొన్నారు.

సెబ్ అధికారుల దాడి

మధురపూడి: కోరుకొండ మండలం కోటికేశవరంలోని సారా తయారీ కేంద్రంపై గురువారం సెబ్ అధికారులు దాడి చేశారు. సారా తయారు చేస్తున్న శెట్టి సురేష్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి 20 లీటర్ల సారా, తయారీ కోసం ఉంచిన 25 కేజీల బెల్లం, రవాణా కోసం ఉపయోగించే మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సురేష్‌ను కోర్టులో హాజరుపరిచారు.

విధులకు ఆటంకం కలిగించారని కేసు

సీతానగరం: తన విధులకు ఆటంకం కలిగించారని సీతానగరానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ తమర్స గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గళ్లకు చెందిన ఈతకోట గణేష్‌తోపాటు మరో ఇద్దరు యువకులపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు గురువారం తెలిపారు. రాజమహేంద్రవరం - పురుషోత్తపట్నం రూట్‌లో తిరిగే బస్సుకు డ్రైవర్‌గా గోపి ఉన్నారు. బుధవారం రాత్రి 7.30 గంటలకు రఘుదేవపురం రంగారావు ఆసుపత్రి వద్ద ఎదురుగా ఆయిల్ ట్యాంకర్ రావడంతో బస్సును రోడ్డుకు పక్కగా నిలిపాడు. ఆ సమయంలో ముగ్గళ్లకు చెందిన గణేష్‌తోపాటు మరో ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి డ్రైవర్‌తో ఘర్షణ పడి, విధులకు ఆటంకం కలిగించారు.

456 మందికి వైద్యసేవలు



నాగంపల్లి రోగులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని నాగంపల్లిలో గురువారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.రాజు 456 మందికి వైద్య సేవలందించారు. రోగులకు అవసరమైన పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అలాగే డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా నాగంపల్లిలో స్కూల్ విద్యార్థులకు డెంగీ నివారణపై డాక్టర్ రాజు అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఏ శ్రీనివాసరావు, ఏఎన్‌ఎం శిరోమణి, ఆశా వర్కర్లు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అర్థమయ్యేలా బోధన

రాజానగరం: నూతన విద్యా విధానంలో విద్యార్థికి అర్థమయ్యేలా బోధన అందించడానికి ప్రతి ఉపాధ్యాయుడూ కృషి చేయాలని ఎంఈఓ-1 రామన్నదొర సూచించారు. ఇందుకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలు రూపొందించారన్నారు. రాజానగరం, దివాన్ చెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆయా క్లస్టర్లకు సంబంధించిన 50 శాతం మంది ఉపాధ్యాయులతో గురువారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలను సరఫరా చేశామన్నారు. మిగిలిన సగం మంది ఉపాధ్యాయులకు శుక్రవారం ఇదే క్లస్టర్లలో సమావేశం నిర్వహిస్తామని అన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

గోకవరం: తిరుమలాయపాలెం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు క్రమంలో చోటు చేసుకున్న ఘటనల్లో గాయపడిన వారిని నాసా సంస్థ అధినేత నూతలపాటి సోనీవుడ్ గురువారం పరామర్శించారు. ఎస్సీ పేటలో పర్యటించిన ఆయన బాధిత కుటుంబ సభ్యులను ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అధికారులతో మాట్లాడి అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సుమారు 120 కుటుంబాలకు ఆయన నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కృష్ణమూర్తి, గోపి, శ్రీను, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.